


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు





| ఆదివారం 22 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 293 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## భద్రాచల శ్రీ సీతారామచంద్రమూర్తి ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 22, ప్రతినిధి: భద్రాచల శ్రీ సీతారామచంద్రమూర్తి ఆలయ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో, పూజారులు, అధికారులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన భూసేకరణను సమీక్షిస్తూ ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించిన సీఎం ఆలయ సహజత్వానికి భంగం కలగకుండా పూర్తిగా ఆగమశాస్త్రానుసారం అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వచ్చే గోదావరి పుష్కరాల నాటికి చేయగలిగిన పనులను ముందుగా గుర్తించి అంచనాలతో తొలి దశ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల ప్రణాళికలకు అనుగుణంగా ఆలయ సమీపంలో ఘాట్ల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొంటూ 2027 మార్చి 31 నాటికి తొలి దశ పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పనిచేయాలని, పుష్కరాలు అనంతరం మిగతా పనులు పూర్తి చేసేందుకు ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం సూచించారు.

## దేశంలో డేటా సెంటర్ల విస్తరణ వేగం – ఐదేళ్లలో నాలుగు రెట్లు పెరుగుదల




సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 22, ప్రతినిధి: దేశంలో డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా కొనసాగుతోంది. గత ఐదేళ్లలో డేటా సెంటర్ల సామర్థ్యం నాలుగు రెట్లు పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ముంబై నుంచి చెన్నై వరకు దేశవ్యాప్తంగా ఆధునిక సాంకేతికత ఆధారంగా కొత్త డేటా సెంటర్లు ఏర్పాటు అవుతూ డిజిటల్ రంగంలో కీలక మార్పులకు దారితీస్తున్నాయి. సమాచార సాంకేతిక రంగం వేగంగా విస్తరిస్తుండడంతో డిజిటల్ విప్లవం ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డేటా నిల్వ, క్లౌడ్ సేవలు, డిజిటల్ సేవల విస్తరణతో భారత్ సాంకేతిక రంగంలో మరింత ముందుకు సాగుతున్నట్లు పేర్కొంటున్నారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 22, ప్రతినిధి: రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాల్వ) టన్నెల్ ప్రాజెక్టు పురోగతిపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పనుల ప్రగతి, భద్రతా చర్యలు, భూగర్భ సర్వేలు, మిగిలిన పనుల పూర్తి దశలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. టన్నెల్ మొత్తం సుమారు 44 కిలోమీటర్ల పొడవు ఉండగా ఇప్పటివరకు ఎక్కువ భాగం పనులు పూర్తయ్యాయని, మిగిలిన భాగాన్ని కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.ప్రాజెక్టు గతంలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ సర్వేలు వినియోగించాలని సూచించారు. భూగర్భ పరిస్థితులను ముందుగా అంచనా వేసేందుకు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ప్రత్యేక సర్వేలు చేపట్టాలని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు దక్షిణ తెలంగాణ జిల్లాలకు జీవనాడిగా నిలుస్తుందని, కృష్ణా జలాలను నల్లగొండ తదితర ప్రాంతాలకు సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి తెలిపారు. పనులను దశలవారీగా పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులో పూర్తి చేయడానికి కట్టుబడి పనిచేయాలని అధికారులకు ఆదేశించారు.



## కార్పొరేట్ సెలూన్ల పెరుగుదలపై చిన్న వ్యాపారుల ఆందోళన – తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 22, ప్రతినిధి: కార్పొరేట్ సెలూన్ సెంటర్ల పెరుగుదలతో చిన్న కటింగ్ షాపుల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. ఈ సమస్యపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకప్పుడు అరుదుగా ఉండే కార్పొరేట్ సెలూన్లు ప్రస్తుతం ప్రతి ప్రాంతంలో, జనసంచారం తక్కువగా ఉన్న గల్లీలలో కూడా స్థాపించబడుతున్నాయని, దీని వల్ల చిన్న వ్యాపారుల జీవనోపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రాలేదని తెలిపారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న స్పందిస్తూ చిన్న వృత్తిదారుల జీవనోపాధిని కాపాడేందుకు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చిన్న వ్యాపారులను పట్టించుకోవాలని, వారి హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.

## రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు ఈద్ శుభాకాంక్షలు తెలియజేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డి





సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 22, ప్రతినిధి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో నియమనిష్టలతో ఉపవాస దీక్షలు పాటించి పండుగను జరుపుకుంటున్న అందరికీ అల్లా దయతో ఆనందం, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని కోరారు.

## తిరుమలలో ఆధునిక సదుపాయాలు – భక్తులకు నాణ్యమైన సేవలందించడంలో టీటీడీకి అభినందనలు



సందేశం టైమ్స్, తిరుమల, మార్చి 22, ప్రతినిధి: తిరుమల పవిత్రతను కాపాడుతూ శ్రీవారి భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు టీటీడీ తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం గా నిలుస్తున్నాయి. తిరుమలకు వచ్చే కోట్లాది మంది భక్తుల నమ్మకం, విశ్వాసాలను మరింత బలోపేతం చేసే దిశగా టీటీడీ మరో కీలక ముందడుగు వేసింది. స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ సంయుక్తంగా టీటీడీ సహకారంతో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక వాటర్-ఫుడ్ అనాలసిస్ ల్యాబ్ ప్రారంభమైంది. ఈ ల్యాబ్ ద్వారా ప్రసాదాల తయారీలో వాడే ముడి పదార్థాల నాణ్యతను సూక్ష్మ స్థాయిలో పరీక్షించవచ్చు. ఇందులోని ఈ-టంగ్, ఈ-నోస్ వంటి ఆధునిక సదుపాయాల ద్వారా ఆహార పదార్థాల రుచి, వాసనలను డిజిటల్ పద్ధతిలో విశ్లేషించే అవకాశం ఉంది. అదేవిధంగా భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు, రద్దీ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా జనసాంద్రత, దర్శన సమయం, వాహనాల రాకపోకలు, వసతి, వైద్య అత్యవసర పరిస్థితులను ఒకే వేదికపై రియల్ టైమ్‌లో పర్యవేక్షించి మెరుగైన సేవలు అందించవచ్చు. ఏఐ ఆధారిత విశ్లేషణ ద్వారా రద్దీ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి క్యూ మేనేజ్‌మెంట్‌ను సమర్థంగా నిర్వహించే అవకాశం కలుగుతుంది. పవిత్రత, ఆధ్యాత్మికత, సౌకర్యం, ప్రశాంతతను కాపాడుతూ టెక్నాలజీ వినియోగంతో భక్తులకు సేవలందించడంలో టీటీడీ చేస్తున్న కృషి పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అటవీ సంరక్షణపై పావన్ కళ్యాణ్ పిలుపు – పచ్చదనానికి ఆంధ్రప్రదేశ్ కట్టుబాటు




సందేశం టైమ్స్, అమరావతి, మార్చి 22, ప్రతినిధి: ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ సంరక్షణపై పావన్ కళ్యాణ్ ప్రజలకు పిలుపునిచ్చారు. అటవీలు భూమాతకు ఊపిరితిత్తుల్లాంటివని, నదులు మరియు జీవ వైవిధ్యానికి మూలమని పేర్కొంటూ వాటిని రక్షించడం మన అస్తిత్వాన్ని కాపాడుకోవడమేనని తెలిపారు. అటవీ సంరక్షణ ఒక ఎంపిక కాదని, అది సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వనమహోత్సవం, గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వంటి కార్యక్రమాల ద్వారా కీలక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు సుస్థిరమైన పర్యావరణాన్ని అందించాలంటే అటవీలను కాపాడాలని పిలుపునిచ్చారు.

## చాట్ జీపీటీ, జెమినీ సలహాలతో మందులు వాడొద్దు – నిపుణుల హెచ్చరిక

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 22, ప్రతినిధి: ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధితో చాలామంది ఆరోగ్య సమస్యలకు వెంటనే పరిష్కారం కోసం చాట్ జీపీటీ వంటి ఆన్‌లైన్ వేదికలను ఆశ్రయిస్తూ, అక్కడి సమాచారాన్ని ఆధారంగా చేసుకొని స్వయంగా మందులు వాడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొందరు చిన్నపాటి జలుబు, జ్వరం వంటి సమస్యలకు కూడా డాక్టర్‌ను సంప్రదించకుండా, ఇంటర్నెట్‌లో వచ్చిన సలహాల ప్రకారం మందులు వాడి ఆరోగ్యాన్ని మరింత ప్రమాదంలోకి నెట్టుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితి వేరు కావడంతో, ఒకరికీ సరిపడే మందు మరొకరికి హానికరంగా మారే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చాట్ జీపీటీ వంటి సాంకేతిక వేదికలు సాధారణ సమాచారం మాత్రమే అందిస్తాయని, అవి వైద్యుల స్థానంలోకి రావని స్పష్టం చేస్తున్నారు. కాబట్టి ప్రజలు గుడ్డిగా నమ్మి మందులు వాడకుండా, ఏ ఆరోగ్య సమస్య వచ్చినా తప్పనిసరిగా అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచిస్తున్నారు.



## రామచంద్రాపురం ఈద్గా వద్ద ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ – మత సామరస్యానికి ప్రతీకగా అలై బలై

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా, రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ 112వ డివిజన్ పరిధిలోని ఈద్గా వద్ద రంజాన్ పండుగ సందర్భంగా శుక్రవారం ముస్లిం మైనార్టీ సోదరులు తండోపతండాలుగా తరలివచ్చి పవిత్రమైన ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌ను ఘనంగా ఆచరించారు. ముప్పై రోజుల ఉపవాస దీక్షలు ముగిసిన అనంతరం ఆనందోత్సాహాలతో ఈద్ పండుగను జరుపుకుంటూ ఈద్గా ప్రాంగణంలో అలై బలై కార్యక్రమం నిర్వహించి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు కలసి ‘హిందూ ముస్లిం భాయి భాయి’, ‘గంగా జమున తహజీబ్’ వంటి నినాదాలతో మత సామరస్యాన్ని చాటుతూ అన్ని మతాల ఐక్యతకు ప్రతీకగా నిలిచారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీయూఎస్ మండల అధ్యక్షుడు అబ్బు అలీ ఖురేషి పాల్గొని ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేయగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు ఆత్మహత్య పాల్వట్ల గ్రామంలో విషాదం



సందేశం టైమ్స్, వట్‌పల్లి, మార్చి 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పాల్వట్ల గ్రామానికి చెందిన రేగోటి సంగప్ప (75), తండ్రి బసప్ప, లింగాయత్ కులానికి చెందిన రైతు, గత కొన్ని నెలలుగా కిడ్నీ రాళ్లు మరియు హెర్నియా సమస్యలతో తీవ్ర అనారోగ్యానికి గురై బాధపడుతూ హైదరాబాద్‌లోని వెల్నెస్ ఆసుపత్రి మరియు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిడ్నీ నొప్పిని భరించలేక మార్చి 20 రాత్రి ఆసుపత్రి నుండి ఇంటికి చేరుకున్న ఆయన, మార్చి 21 తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినప్పుడు గ్రామ సమీపంలోని స్మశానవాటిక వద్ద చింత చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడి కుమారుడు రేగోటి అనిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా మృతదేహంపై జోగిపేట ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించిన అనంతరం అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### జోగిపేట ఈద్గాల్లో రంజాన్ ప్రార్థనలు – కౌన్సిలర్ పొట్లూరి శివశేఖర్ పాల్గొనడం



సందేశం టైమ్స్, అందోల్ మండలం, మార్చి 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని ఈద్గాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో 13వ వార్డు కౌన్సిలర్ పొట్లూరి శివశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ సామరస్య భావనను చాటారు. కార్యక్రమంలో డాక్టర్ సోమప్ప మాని, షేక్ అమీర్, ముస్లిం మత పెద్దలు, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

## మర్వేల్లి ఈద్గాలో రంజాన్ ప్రార్థనలు ఘనంగా



సందేశం టైమ్స్, వట్‌పల్లి, మార్చి 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మర్వేల్లి గ్రామ పరిధిలోని ఈద్గాలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

## నర్మేటలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

సందేశం టైమ్స్, సిద్దిపేట, మార్చి 22, ప్రతినిధి: ఈ నెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లాలో పర్యటించనున్నారు. నంగునూరు మండలం నర్మేటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనుండగా, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత మూడు రోజులుగా ఫ్యాక్టరీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న రైతు మహోత్సవాలకు వివిధ జిల్లాల నుండి భారీగా రైతులు తరలివస్తున్నారు. ఏర్పాటు చేసిన 150 స్టాళ్లలో వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్ ఫామ్ తోటల పెంపకం, ఉద్యానవన, పాడి పరిశ్రమ, మత్స్య రంగాల ద్వారా అధిక దిగుబడి సాధించే విధానాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొని పైలాన్ ఆవిష్కరణతో పాటు స్టాళ్లను సందర్శించనున్నారు. అలాగే తెలంగాణలో మొట్టమొదటి ఆయిల్ రిఫైనరీకి శంకుస్థాపన చేయనున్నారు. సీఎం పర్యటన విజయవంతం కోసం మంత్రులు, అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, హెలిపాడ్, సభ వేదిక, భద్రత, తాగునీరు, ట్రాఫిక్, పార్కింగ్, విద్యుత్, సౌండ్ సిస్టమ్, అంబులెన్స్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

## బోరంచ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం ఒకరోజు అధికారులుగా మెరిసిన విద్యార్థులు



సందేశం టైమ్స్, మనూర్ మండలం, మార్చి 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మనూర్ మండలంలోని బోరంచ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన పెంపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఒక రోజు పాటు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల మరియు జిల్లా విద్యాధికారుల పాత్రలను స్వీకరించి సమర్థంగా నిర్వహించారు. తరగతులను బోధిస్తూ క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ నైపుణ్యాలను ప్రదర్శించిన విద్యార్థులు పాఠశాల నిర్వహణపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమం అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు అశోక్ రావు, ఉపాధ్యాయులు శ్రీధర్, విఠల్, ఉపాధ్యాయురాలు కవిత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా సాగి విద్యార్థుల చురుకుదనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## సాయిపేట గ్రామ సభలో అభివృద్ధి పనులకు శ్రీకారం – సీసీ రోడ్లు, డ్రైనేజ్ పై చర్చ



సందేశం టైమ్స్, వట్‌పల్లి మండలం, మార్చి 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని సాయిపేట గ్రామంలో నేడు గ్రామసభను నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన సీసీ రోడ్లు, మురికి కాలువలు, డ్రైనేజ్ వంటి అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. గ్రామ సర్పంచ్ ఆలూరి సంతోష, ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉప సర్పంచ్ సామల మీనా, చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని గ్రామ అభివృద్ధిపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.



## రాయికోడ్‌లో బాలమోల మల్లేశం అంత్యక్రియలు పాల్గొన్న రాహుల్ కిరణ్

సందేశం టైమ్స్, రాయికోడ్, మార్చి 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వరం: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ గ్రామ సర్పంచ్ బాలమోల తుకారం సోదరుడు బాలమోల మల్లేశం గుండెపోటుతో మృతిచెందగా ఆయన అంత్యక్రియలు స్వగ్రామం రాయికోడ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు రాహుల్ కిరణ్ పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చేవెళ్ల విటల్, మండల ప్రధాన కార్యదర్శి శంకర్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అబేద్ అలీ, సర్పంచులు మహబూబ్ పటేల్, బసవరాజ్, నరేష్, మొగులయ్య, యువజన అధ్యక్షుడు అంజి ముదిరాజ్, మండల నాయకులు రవీందర్ కుమార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## తారా ప్రభుత్వ కళాశాలలో మార్చి 23న ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాలలో ఈ నెల 23వ తేదీ సోమవారం ప్రముఖ ఫార్మాస్యూటికల్ సంస్థ ఎంఎస్ఎన్ లాబొరేటరీస్, రుద్రారం ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ తెలిపారు. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ), కెమిస్ట్రీ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి కళాశాల ప్రాంగణంలో జరిగే ఈ డ్రైవ్‌కు బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) చదువుతున్న లేదా పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు తమ జీవన వివరణ పత్రం మరియు విద్యార్హతల పత్రాల ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు ఇది మంచి అవకాశమని, అర్హులైన వారు పెద్ద సంఖ్యలో హాజరై ఉపయోగించుకోవాలని ప్రిన్సిపాల్ ఎం. ప్రవీణ, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ వీరేందర్, కెమిస్ట్రీ విభాగాధిపతి డా. వినోద్ కుమార్ గౌడ్, టీఎస్‌కేసీ కన్వీనర్ డా. సుచిత్ర సింగ్ కోరారు.

### జహీరాబాద్ ఈద్గాలో రంజాన్ వేడుకలు – పాల్గొన్న మాజీ మంత్రి డా. ఏ. చంద్రశేఖర్




సందేశం టైమ్స్, జహీరాబాద్, మార్చి 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా వద్ద పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ ఇంచార్జ్ డా. ఏ. చంద్రశేఖర్ పాల్గొని ముస్లిం మైనారిటీ సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రంజాన్ పర్వదినం మనందరిలో సోదరభావాన్ని పెంపొందించి సమాజంలో ఐక్యతను బలపరచాలని, అల్లాహ్ కృప జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, జహీరాబాద్ మునిసిపల్ చైర్మన్ యూనుస్, వార్డ్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు హుగ్గెళ్లి రాములన్న తదితరులు పాల్గొన్నారు.



## నీలం మధు స్వయంపరిచయం – చిట్కుల్ లో శ్రీ రామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 22, ప్రతినిధి: ధర్మ రక్షణ, భక్తి భావంతో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ తన సొంత నిధులతో చిట్కుల్ జిటిఎన్ కాలనీలో శ్రీ రామచంద్రస్వామి దేవాలయ నిర్మాణాన్ని చేపట్టి శనివారం వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభించారన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో దేవాలయ ప్రాంగణం మార్మోగింది. మొదటి రోజున ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, రక్షాబంధన, యాగశాల సంస్కారాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి. సాయంత్రం పంచవింశతి కలశ స్నానంతో మూర్తుల శుద్ధి, దీక్షాధారణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠా, వాస్తు, నవగ్రహ, క్షేత్రపాల దేవతలకు హోమాలు ఘనంగా జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ కూడా జరిగింది. చిట్కుల్ గ్రామం మరియు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం పొందారు.




## నర్సాపూర్‌లో జిల్లా అధికార ప్రతినిధులను కాంగ్రెస్ నాయకులు సన్మానం చేశారు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 22, ప్రతినిధి: ఈరోజు మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ పట్టణంలో మెదక్ జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నికైన ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్ గారిని కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ నరేంద్ర రెడ్డి గారికి కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని, మండల అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొని పార్టీపట్ల నిబద్ధత, భవిష్యత్తులో బాధ్యతాయుతంగా పనిచేయమని అభిప్రాయపడ్డారు. వారు జిల్లా నాయకులకు, సీనియర్ కాంగ్రెస్ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, నర్సాపూర్ నియోజకవర్గ సీతారాంపూర్ గ్రామంలో జరగబోయే సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నాయకులకు ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది. కార్యక్రమంలో శ్రీశైలం యాదవ్, రాధాకృష్ణ, మన్నె శ్రీనివాస్, మాలోత్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ ఆకుల నర్సింలు, సురేందర్ గౌడ్, మన్నె వెంకటేష్, ఆంజనేయులు గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




## నారాయణఖేడ్ ఈద్గా రంజాన్ వేడుకలు ఘనంగా – ఎంపీ సురేష్ కుమార్ శేట్కర్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు

సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మార్చి 22, ప్రతినిధి: నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఈద్గా సమీపంలో రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. పట్లోళ్ల సంజీవరెడ్డి ముస్లిం సోదరులతో కలిసి 'అలయ్ బలయ్' అంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజెప్పి మత సామరస్యాన్ని, సోదరభావాన్ని పెంపొందించమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, నగేష్ కుమార్ శేట్కర్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, ముస్లిం మత పెద్దలు, మైనారిటీ సోదరులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముస్లాపూర్ గ్రామంలో పేదలకు 'ఇందిరమ్మ ఇళ్లు' ప్రారంభం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 22, ప్రతినిధి: ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇవ్వనున్నారు 'ఇందిరమ్మ ఇళ్లు' కార్యక్రమం ముస్లాపూర్ గ్రామంలో కొత్తగోళ్ల లక్ష్మి భర్త కిష్టయ్య గారి ఇళ్ల ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మంత్రి వర్యులు దామోదర్ రాజనర్సింహ గారి ఆశీస్సులతో వేడుక ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నర్సిని నర్సింలు, వార్డు మెంబర్స్ పల్లే శంకర్ చిలపల్లి నర్సింలు, బండారి బాబు, కాంగ్రెస్ నాయకులు బేగరి చక్రపాణి, పుండరికం మైనొద్దిన్, పిట్టే మల్లేశం, విషు సెట్, నాయకోటి సత్యనారాయణ, నాయకోటి పోచయ్య, జావేద్ తదితరులు పాల్గొని ఘనతను చాటారు.



## రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేసిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్


సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 22, ప్రతినిధి: రంజాన్ పండుగ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్వయంగా ముస్లిం సోదరుల ఇంటికి వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా పలకరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన రంజాన్ పండుగ త్యాగం, సహనం, దానధర్మాల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుందని, ఉపవాస దీక్షల ద్వారా మనసును పవిత్రం చేసుకొని సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతితో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, చింత సాయినాథ్, గోవర్ధన్ నాయక్, శ్రీధర్ రెడ్డి, నాగేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం సోదరులు, యువకులు, పార్టీ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



## హైదరాబాద్‌లో షాకింగ్ ఘటన: కుళ్లిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారీ

కుల్సుంపురా, సందేశం టైమ్స్, ప్రతినిధి, 22 మార్చి 2026: హైదరాబాద్‌లోని కుల్సుంపురా ప్రాంతంలో ఆహార భద్రతను విస్మరించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఒక దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. అబ్దుల్ అనే వ్యక్తి తన తయారీ కేంద్రంలో కుళ్లిన పదార్థాలతో సమోసాలు మరియు పఫ్స్ తయారు చేస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా కుళ్లిన గుడ్లతో పఫ్స్ తయారు చేసి నగరంలని పలు ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. విశ్వసనీయ సమాచారం అందుకున్న HFAST అధికారులు సదరు కేంద్రంపై దాడులు నిర్వహించి, భారీగా నాసిరకం ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అబ్దుల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన అధికారులు, ప్రజలు బయట ఆహారం తినేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఉద్యోగం పేరుతో భారీ మోసం: 60 మంది నిరుద్యోగులను ముంచిన కేటుగాడు



సూర్యాపేట, సందేశం టైమ్స్, ప్రతినిధి, 22 మార్చి 2026: ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఒక భారీ మోసం సూర్యాపేట జిల్లాలో వెలుగులోకి వచ్చింది. నిందితుడు తనకు హైదరాబాద్ డీఎంఈ (DME) అధికారులతో సన్నిహిత పరిచయాలు ఉన్నాయని నమ్మబలికి, సుమారు 60 మంది బాధితుల నుండి ఏకంగా 1.85 కోట్ల రూపాయలను వసూలు చేశాడు. ఒక్కొక్కరి నుంచి 3 లక్షల నుండి 5 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తూ, వారికి నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లను కూడా చూపించి నమ్మించాడు. అయితే, ఉద్యోగ ఫలితాలు విడుదలైన తర్వాత తమకు ఉద్యోగాలు రాకపోవడంతో కంగుతిన్న బాధితులు, తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని నిందితుడిని నిలదీయగా అతను స్పందించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని, కేవలం అధికారిక నోటిఫికేషన్ల ద్వారానే ఉద్యోగ ప్రక్రియలు జరుగుతాయని, ఇలాంటి మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## మియాపూర్‌లో దారుణం: పెళ్లి చేసుకుందన్న కోపంతో మహిళపై కత్తి దాడి



మియాపూర్, సందేశం టైమ్స్, ప్రతినిధి, 22 మార్చి 2026: హైదరాబాద్‌లోని మియాపూర్‌లో తనను కాదని మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కక్షతో ఒక మహిళపై కిరాతకమైన కత్తి దాడి జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే, కాకినాడకు చెందిన నూకరత్నం అనే మహిళ మియాపూర్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది, గతంలో భర్తను కోల్పోయిన ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, గత నెల 20న ప్రసాద్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. అయితే, అదే ప్రాంతంలో వంటమనిషిగా పనిచేస్తున్న ఆలీషా అలియాస్ పాండు, నూకరత్నం తనకు చెప్పకుండా వివాహం చేసుకుందని ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19న తన తండ్రి లాలూ మరియు స్నేహితుడు జాన్‌తో కలిసి ఆమె ఇంటికి వెళ్లి తన వెంట రావాలని ఒత్తిడి చేయగా, అందుకు ఆమె నిరాకరించడంతో ఆగ్రహించిన ఆలీషా తన వెంట తెచ్చుకున్న కత్తితో నూకరత్నంపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడు ఆలీషా మరియు అతని తండ్రి లాలూను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

## కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలు 2026–27: ముఖ్యమైన వివరాలు

సందేశం టైమ్స్: 2026–27 విద్యా సంవత్సరం కోసం కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్ దరఖాస్తులు మార్చి 20, 2026 ఉదయం 10 గంటలకు ప్రారంభమై, ఏప్రిల్ 2, 2026 వరకు అందుబాటులో ఉంటాయి. 2వ తరగతిపై ఖాళీలుంటే ఆఫ్‌లైన్ దరఖాస్తులు ఏప్రిల్ 2–4, 2026 మధ్య పూర్తి చేయవచ్చు. మెరిట్ జాబితా మార్చి–ఏప్రిల్ 2026లో విడుదల చేయబడుతుంది, తరగతులు జూన్ 2026 నుండి ప్రారంభమవుతాయి.

అర్హత (1వ తరగతి): 31 మార్చి 2026 నాటికి 6 సంవత్సరాలు వయసు ఉండాలి. ఎటువంటి పరీక్షలు లేదా ఇంటర్వ్యూలు అవసరం లేకుండా, ఎంపిక లాటరీ (Draw of Lots) ద్వారా జరుగుతుంది.

దరఖాస్తు విధానం:

https://kvsangathan.nic.in� వెబ్‌సైట్‌లోకి వెళ్ళి Admission 2026–27 పై క్లిక్ చేయండి

మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకోండి

దరఖాస్తు ఫారమ్ నింపి అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేయండి

ఫారమ్ సమర్పించి డౌన్‌లోడ్ చేసుకోండి

అవసర పత్రాలు: జనన సర్టిఫికేట్, చిరునామా రుజువు, కుల ధృవపత్రం (ఉంటే), ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (పై తరగతులకు), పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు.

రిజర్వేషన్: SC/ST, OBC, EWS, దివ్యాంగులు (PH).

ఎంపిక విధానం: లాటరీ ద్వారా, ఎంపిక జాబితా ఆన్‌లైన్‌లో విడుదల అవుతుంది.



## వాణిజ్య సిలిండర్ల సరఫరా పెంపు – కేంద్రం కీలక నిర్ణయం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 22: కేంద్ర ప్రభుత్వం వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరాను 20 శాతం పెంచే విధంగా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యేకంగా వలస కూలీలకు ఉచితంగా 5 కిలోల సిలిండర్లు అందించాల్సిన అంశాన్ని కూడా ఆదేశించింది. అన్ని రాష్ట్రాలకు లేఖల ద్వారా కేంద్రం ఈ సమాచారం అందించగా, ఎల్లుండి నుంచి అదనపు సిలిండర్ల సరఫరా ప్రారంభిస్తామని వెల్లడించింది. కేంద్రం సూచనల ప్రకారం రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్ళు, పరిశ్రమలు, ఆఫీసుల క్యాంటీన్లకు గ్యాస్ కొరత రాకుండా కచ్చితంగా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు.




## హైదరాబాద్‌లో మహిళా వ్యాపారవేత్తపై రూ.1.20 కోట్ల సైబర్ మోసం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 22, ప్రతినిధి: హైదరాబాద్‌లో మహిళా వ్యాపారవేత్తను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రూ.1.20 కోట్ల మోసానికి పాల్పడ్డారు. మాజీ డీజీపీ మనుమరాలు అయిన ఆ మహిళ 18 కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 13న ఆమె పేరు, ఫోటోతో అకౌంటెంట్‌కు వాట్సాప్‌లో సందేశం పంపి, “మీటింగ్‌లో ఉన్నాను... చెప్పిన ఖాతాకు రూ.1.20 కోట్లు పంపండి” అని పేర్కొన్నారు. మహిళ నుండి వచ్చిన సందేశమని నమ్మిన అకౌంటెంట్ వెంటనే ఆ మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేసిన తర్వాతే మోసం అని తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## బంగారం ధరలు 10 రోజుల్లో భారీగా పతనం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 22, ప్రతినిధి: దేశంలో బంగారం ధరలు గణనీయంగా తగ్గుతున్నాయి. కేవలం 10 రోజుల్లోనే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరలో రూ.13,320 తగ్గుదల నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరలో రూ.12,160 మేర తగ్గుదల నమోదు అయింది. తాజా రేట్ల ప్రకారం, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,900గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,540గా నమోదైంది. ఈ తగ్గుదలతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది అనుకూల సమయంగా భావిస్తున్నారు.



## తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో కిరణ్ కుమార్ గెలుపు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 22: తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో కిరణ్ కుమార్ గన్నమనేని ఘన విజయాన్ని సాధించారు. ఈరోజు జరిగిన కౌంటింగ్‌లో ఆయన గెలుపు ఖరారైంది. జనవరి నెలలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఎన్నికల ఫలితాలు గత కొన్ని వారాల కౌంటింగ్ అనంతరం ఈరోజు వెల్లడయ్యాయి.ఇంతకుముందు నాంపల్లి బార్ అసోసియేషన్‌లో సెక్రటరీ, అధ్యక్షుడిగా సేవలందించిన కిరణ్ కుమార్ గారు, తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.ఆయన విజయం అనంతరం మాట్లాడుతూ, అడ్వకేట్ల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తానని, ఇతర బార్ కౌన్సిల్ సభ్యులతో కలిసి ‘అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్’ సాధన దిశగా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కాకినాడ పోర్టులో 140 టన్నుల రేషన్ బియ్యం సీజ్



సందేశం టైమ్స్, కాకినాడ, మార్చి 22, ప్రతినిధి: కాకినాడ పోర్టులో సివిల్ సప్లై అధికారులు ఐదు లారీలలో తరలిస్తున్న 140 మెట్రిక్ టన్నుల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.65 లక్షలుగా అంచనా. అధికారుల వివరాల ప్రకారం, బియ్యంలో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలిసినట్లు గుర్తించబడింది. పోలీసులు ఈ బియ్యాన్ని విదేశాలకు అక్రమంగా ఎగుమతి చేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలో పట్టుకున్నారు. ఈ ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.



## ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కోసం బీఆర్ఎస్ ప్రైవేట్ మెంబర్ బిల్లు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 22, ప్రతినిధి: ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ ప్రైవేట్ మెంబర్ బిల్లును రూపొందించింది. ఈ బిల్లును వచ్చే శుక్రవారం శాసనసభ, మండలిలో ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు. ఈ విషయాన్ని కేటీఆర్ వెల్లడించారు. గ్యారెంటీల అమలుపై రాజకీయంగా ఆసక్తి నెలకొన్న పరిస్థితిలో ఈ బిల్లు ప్రవేశపెట్టబోతోంది.

## భార్య వియోగం తట్టుకోలేక ఎస్సై ఆత్మహత్య: అనాథలైన ఇద్దరు చిన్నారులు



జమ్మికుంట, సందేశం టైమ్స్, ప్రతినిధి, 22 మార్చి 2026: కరీంనగర్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది, టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ యాదవ్ జమ్మికుంట మండలం సీతంపేటలోని తన అత్తగారింట్లో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ నెల 17న ఆయన భార్య దివ్య కడుపునొప్పి భరించలేక గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకోగా, ఆ మనస్తాపంతో ఎస్సై సైతం ప్రాణాలు తీసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. కేవలం కొద్దిరోజుల వ్యవధిలోనే దంపతులిద్దరూ మరణించడంతో వారి ఇద్దరు చిన్న పిల్లలు అనాథలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ఈ వరుస మరణాలతో ఆ కుటుంబంలో మరియు పోలీస్ శాఖలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.